ఇంటర్మీడియట్ అధికారి రమణిని సన్మానిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

జిల్లాకు మరింత గుర్తింపు తీసుకురావాలి

- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరికలెక్టరేట్, ఏప్రిల్ 23 : జిల్లాలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని మరింత పెంచి రాష్ట్రంలోనే జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం వెలువడిన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లా 14వ స్థానం పొందడాన్ని హర్షిస్తూ ఇంటర్మీడియట్ జిల్లా అధికారి సి. రమణిని కలెక్టర్ బుధవారం ఆయన ఛాంబర్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ మొదటి సంవత్సర ఫలితాల్లో 6,208 విద్యార్థులకు గానూ 3,634 మంది ఉత్తీర్ణత చెందారని, రెండో సంవత్సర ఫలితాల్లో 5,530 మందికి గానూ 3,756 మంది ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో 14వ స్థానం పొందడం సంతోషకరమన్నారు. రానున్న రోజుల్లో ఉత్తీర్ణతా శాతాన్ని మరింత పెంచాలని కోరారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులున్నారు.

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 12 : అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ, పాట్ల రెగ్యులరైజేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఎల్ఆర్ఎస్ 25 శాతం రాయితీ అవకాశాన్ని అర్హులు నిర్ణీత గడువు లోగా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి ఎల్ఆర్ఎస్‌కు సమర్పించిన ఎల్1, ఎల్2, ఎల్3 దరఖాస్తులపై జిల్లాలోని భూ యజమానులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 30వ తేదీ నాటికి ఎల్ఆర్ఎస్ రాయితీ గడువు ముగుస్తున్నందున వినియోగదారులు త్వరపడాలని కోరారు. గడువు పొడిగించే అవకాశం లేకపోవచ్చని, మళ్లీ ఇటువంటి అవకాశాలు రాదని, యజమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ రెగ్యులరైజేషన్ రుసుము నిర్ణయించామని, ఫీజు చెల్లించేందుకు అర్హత ఉన్న దరఖాస్తుదారులు ఈ నెల 30వ తేదీలోగా నిర్ణీత రుసుము చెల్లిస్తే 25 శాతం రాయితీ వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శోభారాణి, భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీఓలు కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, పంచాయతీ అధికారి సునంద, భూ యజమానులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనను సబ్బండ వర్గాలు కోరుకుంటున్నాయి : నరేందర్

రామన్నపేట, ఏప్రిల్ 23 : ఈనెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆత్మ కమిటీ జిల్లా డైరక్టర్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఆవుల నరేందర్ పిలుపునిచ్చారు. మండలంలోని నీర్నెముల గ్రామంలో బుధవారం స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన సభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలు కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో రైతులు, సబ్బండ వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బొల్లం సతీశ్, నాయకులు ఆవుల శ్రీధర్, చిప్పల పల్లి రవీందర్, వల్లె శేఖర్‌రెడ్డి, చల్లమల్ల గోపాల్, నాగటి యాదయ్య, సుర్వి లింగస్వామి, ఆవుల భగవంతం, జెట్టి యాదయ్య, బొల్లంరాజు పాల్గొన్నారు.



మోత్కూరు : బుజిలాపురంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగ శ్రీను

రామన్నపేట : నీర్నెముల గ్రామంలో రజతోత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు యువత తరలి రావాలి : కృష్ణ

చౌటుప్పల్‌రూరల్ : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు యువత తరలి రావాలని తెలంగాణ ఉద్యమ నాయకుడు ఉప్పు కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఉద్యమంలో పాల్గొని విజయాన్ని అందుకున్న యువత బీఆర్ఎస్ సభలో పాల్గొని 25 ఏండ్ల ఉద్యమ పార్టీకి అండగా ఉండాలని పేర్కొన్నారు. గ్రామాల్లో బీఆర్ఎస్‌పై ప్రజలకు మద్దతు పెరుగనున్నట్లు చెప్పారు. ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని సభ విజయవంతం చేయాలని కోరారు.

రజతోత్సవ సభకు ఊరూవాడా తరలి రావాలి : శ్రీను

మోత్కూరు : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఊరూవాడా తేడా లేకుండా తరలి రావాలని బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగ శ్రీను కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురంలో బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. ఉద్యమ నేత కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రాన్ని సాధించి పదేండ్లు ప్రజల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేసిందన్నారు. మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు, రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సామ పద్మారెడ్డి, నాయకులు దాసరి తిరుమలేశ్, చేతరాశి వెంకన్న, జిట్ట సాయికుమార్, చెడిపల్లి రఘుపతి, కోక భిక్షం, పంజాల మహేందర్, చుక్క వెంకన్న, నిమ్మల శోభ, మల్లేశ్, గణేశ్, నరేశ్, వెంకన్న పాల్గొన్నారు.

ఆలేరు సీహెచ్‌సీని సందర్శిస్తున్న వరల్డ్ బ్యాంక్ టీమ్

ఆలేరు సీహెచ్‌సీకి వరల్డ్ బ్యాంకు బృందం

ఆలేరు టౌన్, ఏప్రిల్ 23 : పట్టణ కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రపంచ బ్యాంక్ బృందం సభ్యులు డాక్టర్ రమణ, కృష్ణ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఆసుపత్రిలోని రోగులకు అం దుతున్న వైద్య సౌకర్యాలు, వివిధ విభాగాల్లో దవాఖాన సిబ్బంది పనితీరును పరిశీలించారు. వారి వెంట ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ జె . స్వప్న రాథోడ్, యాదాద్రిభువనగిరి ఎన్‌హెచ్ఎం టీమ్ డాక్టర్ సుమన్ కల్యాణ్, డాక్టర్ శిల్పిని, స్టేట్ కన్సల్టెంట్, జేవీ శ్రీనివాస్, డీపీఓ నెహ్రూ, ఆలేరు దవాఖాన డాక్టర్లు జె.స్వప్నా రాథోడ్, డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ పి.రజిని, డాక్టర్ రామ కోటేశ్వర్‌రావు ఉన్నారు.

రైతులు నాణ్యమైన ధాన్యం తేవాలి : ఏఓ సుధారాణి

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 23 : కొనుగోలు కేంద్రాలకు రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలని మండల వ్యవసాయాధికారి ఐ. సుధారాణి అన్నారు. మండలంలోని మాసాయిపేట గ్రామంతోపాటు మండల వ్యాప్తంగా గల ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. ఏ గ్రేడ్ రకం క్వింటాల్ ధాన్యానికి రూ.2,320, కామన్ గ్రేడ్ క్వింటాల్‌కు రూ. 2,300 మద్దతు ధరను ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు తేమశాతం 17 కంటే తక్కువగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. తడి, చెత్త, తాళ్లు లేకుండా నాణ్యతను మెరుగుపర్చుకోవాలని, తద్వారా మెరుగైన ధర పొందువచ్చునని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ప్రణయ్, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట : మాసాయిపేటలో వరిధాన్యాన్ని పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి ఐ.సుధారాణి

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి : భూపాల్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 23 : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పోచంపల్లి పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్ రెడ్డి అన్నారు. మండలంలోని దంతూరులో పోచంపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో, జూలూరు, పెద్దగూడెం, పిల్లాయిపల్లి గ్రామాల్లో బుధవారం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సామ మోహన్ రెడ్డి, అందె లింగం యాదవ్, మార్కెట్ డైరెక్టర్ సుర్వి వెంకటేశ్, లాలయ్య, అంజిరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షురాలు బత్తుల మాధవీశ్రీశైలం గౌడ్ రైతులు పాల్గొన్నారు.

దంతూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ భూపాల్ రెడ్డి

కలెక్టరేట్ ఎదుట మహా ధర్నాను విజయవంతం చేయాలి : సీపీఎం

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 23 : జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 28న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే మహా ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం అన్నారు. ఈ మేరకు మహా ధర్నా ప్రచార కరపత్రాలను బుధవారం విడుదల చేసి మాట్లాడారు. మండలంలోని అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ధర్నాకు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు రచ్చ గోవర్ధన్, గోపాల్‌రెడ్డి, మండల నాయకులు స్వామి, రాంరెడ్డి, శ్రీశైలం, కృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, రాములు పాల్గొన్నారు

మహా ధర్నా కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

శ్రీచైతన్య పాఠశాల ఎదుట విద్యార్థి సంఘాల ఆందోళన

మోత్కూరు, ఏప్రిల్ 23 : మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాల ఎదుట బుధవారం విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఈ పాఠశాలలో అడ్మిషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. యాజమాన్యంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు కూడా లేదని, ఈ విషయమై ఎంఈఓకు విన్నవించినా పట్టించుకోవడం లేదని మండి పడ్డారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోకోవాలని, లేదంటే ఐక్యవిద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో దీక్ష చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు బుర్రు అనిల్‌కుమార్, ఉప్పల శాంతికుమార్, చిప్పల పల్లి చరణ్, జిలాల రాకేశ్, చందు పాల్గొన్నారు.

మానసిక వేదనతో యువకుడు ఆత్మహత్య

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 23 : పట్టణంలో బుధవారం మానసిక వేదనతో మతిస్థిమితం కోల్పోయిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, మృతుడి తల్లి తెలిపిన వివరాలు.. భూదాన్‌పోచంపల్లి మండల పెద్దరావులపల్లి గ్రామానికి చెందిన పర్వతం కిరణ్ (22)తమ్ముడు గత మూడు నెలల కిత్రం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తమ్ముడు మృతి చెందినప్పటి నుంచి మానసికంగా కలత చెందుతూ తరచూ ఆత్మహత్య గురించే మాట్లాడేవాడు. ఈ క్రమంలో ఈనెల 22న తనకు బతకడం ఇష్టం లేదని, తన జీవితాన్ని ముగించుకుంటానని చెప్పి, అదే రోజు రాత్రి 12.40 గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తన సోదరికి ఫోన్ చేసి నేను ఆత్మహత్య చేసుకుంటానని చెప్పాడు. సోదరి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో కిరణ్ ఆచూకీ కోసం వెతకగా పట్టణ పరిధిలోని మారుతి నగర్‌లోని సంజన వెంచర్‌లో గల చింతచెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి మణెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

జడ్పీహెచ్ఎస్ వార్షికోత్సవం

రాజాపేట, ఏప్రిల్ 23 : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాయ్స్‌తో పాటు కుర్రారం జడ్పీ హైస్కూల్లో బుధవారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకున్నది. కార్యక్రమంలో ఎంఈఓ చందా రమేశ్, హెచ్ఎం సట్టు జయంత, కోటిరెడ్డి, పరమేశ్వర్లు, జానయ్య, లెనిన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సరస్వతి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

రాజపేట ఏప్రిల్ 23 : మండలంలోని రఘునాథపురం జడ్పీహెచ్ఎస్‌లో 1999-2000 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సహకారంతో ఏర్పాటు చేయనున్న సరస్వతి విగ్రహానికి బుధవారం పాఠశాల హెచ్ఎం మనోజ్ కుమార్ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సరస్వతి విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తున్న పూర్వ విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 23 : యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాలు.. ఆలేరు పట్టణంలోని చింతలబస్తికి చెందిన మొరిగాడి పరుశురాము (60), మొరిగాడి సంతయ్య(65) స్కూటీపై బీబీనగర్‌లో వివామానికి హాజరై ఎన్‌హెచ్ 163మీదుగా ఆలేరుకు తిరుగు ప్రయాణ మయ్యారు. మండలంలోని బాహుపేట స్టేజీ వద్దకు రాగానే వేగంగా వస్తున్న కారు వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తుల తలకు తీవ్ర గాయాలై పరుశురాము అక్కడికక్కడే మృతి చెందగా, సంతయ్యను చికిత్స నిమిత్తం దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

యాదగిరిగుట్ట : బాహుపేట స్టేజీ వద్ద ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ ఉదయ్‌కుమార్

వర్రె వెంకటేశ్వర్లును కలిసిన యాదవ విద్యావంతుల వేదిక నాయకులు

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 23 : రాష్ట్ర పోలీస్ కంప్లైంట్ అథారిటీ సభ్యుడిగా నియమితుడైన డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లును యాదవ విద్యావంతు ల వేదిక జిల్లా నాయకులు బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు శెట్టి బాలయ్యయాదవ్, సింగనబోయిన మల్లేశ్ యాదవ్, తోటకూర యాదయ్యయాదవ్, మట్టిపెల్లి సతీశ్ యాదవ్, కొత్తపెల్లి ఆనంద్ యాదవ్, శెట్టి రాములుయాదవ్, దొండ శ్రీశైలంయాదవ్, భాస్కర్‌యాదవ్ తదితరులున్నారు.

వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న యాదవ విద్యావంతుల వేదిక జిల్లా నాయకులు

వడదెబ్బ తో అప్రమత్తంగా ఉండాలి : డాక్టర్ కాటం రాజు

చౌటుప్పల్, ఏప్రిల్ 23 : వేసవిలో వడదెబ్బకు గురి కాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ కాటం రాజు అన్నారు. తంగడపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బుధవారం వడదెబ్బపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వడదెబ్బకు గురైతే తీసుకోవాల్సిన జాగ్రత్తల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. నిత్యం 3లీటర్ల నీళ్లు తీసుకోవాలని, ఎండలకు బయటకు వెళ్లొద్దని సూచించారు. అత్యవసరమైతే టోపీలు, కళ్లద్దాలు ధరించాలని సూచించారు. వంటికి చల్లదనాన్ని ఇచ్చే ఆహారం తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ ఖలీల్, ఫార్మాసిస్ట్ ఉమారాణి పాల్గొన్నారు.

వడదెబ్బ జాగ్రత్తలపై పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యాధికారి రాజు

వేసవి సెలవుల్లో టీచర్లను బదిలీలు చేపట్టాలి : శ్రీనివాస్

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 23 : వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కొణతం శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేసి 5 డీఏలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం మండలాధ్యక్షుడు ఆరూర్ ఎల్లయ్య, కార్యదర్శి దొడ్డి రవి, శ్రీను, రమేశ్, వెంకన్న పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : సమావేశంలో మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

యాదగిరిగుట్ట ఈఓ కార్యాలయంలో ఎస్పీఎఫ్ సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందిస్తున్న ఆలయ ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట ఎస్పీఎఫ్ సిబ్బందికి ప్రశంసా పత్రాలు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 23 : గత 6 నెలలుగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సేవలందిస్తున్న ఎస్పీఎఫ్ సిబ్బందిని ఈఓ భాస్కర్‌రావు బుధవారం అభినందించారు. కొండపైన ఈఓ కార్యాలయంలో వారికి ప్రశంసా పత్రాలను అందించి సేవలను కొనియాడారు. ఎస్పీఎఫ్ సీఐ కే.శేషగిరిరావు, ఎస్ఐ తాళ్ల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కొండపైన ఫైర్ మాక్ డ్రిల్

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని బస్టాండ్ ప్రాంతంలో రాష్ట్ర అగ్రిమాపక శాఖ ఆధ్వర్యంలో ఫైర్ మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలు గురించి దేవస్థాన సిబ్బంది, హోంగార్డులు, ఎస్పీఎఫ్ సిబ్బంది, భక్తులకు వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి బి. మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం)లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వివరాలను పరిశీలిస్తున్న గృహనిర్మాణ సంస్థ జిల్లా పీడీ విజయసింగ్, ఎంపీడీఓ రాములునాయక్

అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు : హౌసింగ్ పీడీ

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 23 : అర్హులకు మాత్రమే ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని గృహ నిర్మాణ సంస్థ జిల్లా పీడీ ఎల్.విజయసింగ్ అన్నారు. మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వివరాల కోసం బుధవారం ఆయన ఇంటింటికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన లబ్ధిదారుడుల 4 నుంచి 6 చదరపు అడుగుల స్థలంలో మాత్రమే ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు.

2 నెలల్లో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు మొదటి విడుతలో 767ఇండ్లు మంజూరు అయ్యాయని 459 ఇండ్ల నిర్మాణం ప్రారంభం కాగా 92మంది బేస్మెంట్ లెవెల్ వరకు నిర్మాణం పనులు చేపట్టినట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ రాములునాయక్, గ్రామపంచాయతీ సిబ్బం ది కిష్టయ్య, హరిబాబు తదితరులున్నారు.

ఉచిత వృద్ధాశ్రమం నిర్మించాలి : టాస్కా

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 23 : యాదగిరిగుట్టలో వంద పడకల ఉచిత వృద్ధాశ్రమాన్ని నిర్మించాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్(టాస్కా) మండల అధ్యక్షుడు ముడుంబై జయమోహనాచార్య, కార్యదర్శి పులుగం చక్రపాణి ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని సైదాపురం, మైలారిగూడెం గ్రామాల్లో బుధవారం టాస్కా బృందంతో కలిసి ప్రచారం చేశారు. చట్టపరంగా ఉన్న హక్కులు, ప్రభుత్వాలు కల్పిస్తున్న పథకాలు, ప్రయోజనాలపై రూపొందించిన ప్లెక్సీలను ఆయా గ్రామ వృద్ధులతో కలిసి ఆవిష్కరించారు. పలు చోట్ల టాస్కా వాల్ పోస్టర్లను అతికించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నూకల సుధాకర్‌రెడ్డి, రాగి సహదేవ్, గుండ్లపల్లి మల్లేశంగౌడ్, గుంటి యాదగిరి, గ్రామ పంచాయతీ కార్యదర్శి సీసా అశోక్, గౌడ యాదగిరి, రంగ కృష్ణ, సూరపల్లి నరసింహ, బండి ముత్యం, జీడిపల్లి సుధాకర్, శిఖ శ్రీనివాస్, రామలింగారెడ్డి, గంధమళ్ల కిష్టయ్య, స్వామి పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట : సైదాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న టాస్కా బృందం

కశ్మీర్ యాత్రికులపై ఉగ్రవాదుల దాడి అమానుషం : బాలకృష్ణ

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 13 : జమ్మూ కశ్మీర్‌లోని పహాల్గంలో అమాయకులైన యాత్రికులపై ఉగ్రవాదుల దాడి అత్యంత అమానుష ఘటన అని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెనల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గుర్రాల బాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని వేడుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు.

పెద్దదేవులపల్లి చిన్నచెరువులో నీటిని పరిశీలిస్తున్న పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వర్లు

రూ.92కోట్లతో పైప్‌లైన్ : ఎస్ఈ

త్రిపురారం, ఏప్రిల్ 23 : మండలంలోని పెద్దదేవులపల్లి చిన్న చెరువు నుంచి మిర్యాలగూడ వరకు అమృత్ 2.0 పథకంలో భాగంగా రూ.92 కోట్ల వ్యయంతో పైప్‌లైన్ నిర్మిస్తున్నట్లు పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామంలోని చిన్నచెరువును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణ ప్రజల తాగునీటి కోసం ఇక్కడి నుంచి పైపులైన్ ద్వారా మిషన్ భగీరథ ట్యాంక్‌కు నీళ్లు సప్లయ్ చేయనున్నట్లు తెలిపారు. పనులను త్వరలోనే ప్రారంభిస్తామని, పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట మిర్యాలగూడ మున్సిపల్ డీఈ వెంకన్నతో, ఎన్ఎస్పీ అధికారులు ఉన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి : ఎంఈఓ

త్రిపురారం, ఏప్రిల్ 23 : బడీడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ రవినాయక్ అన్నారు. మండలంలోని బెజ్జికల్ గ్రామంలో బుధవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల బడిబాట కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ ఉచిత పుస్తకాలు, నాణ్యమైన భోజనం, ఆటపాటలతో విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ వంగాల దుర్గ, హెచ్ఎం జొన్నలగడ్డ సైదులు, ఉపాధ్యాయులు నాగరాణి, హరి పాల్గొన్నారు.

బెజ్జికల్ గ్రామంలో బడిబాట

నూతనంగా ఎన్నికైన ఆటోయూనియన్ కార్యవర్గం సభ్యులు

ఆటో యూనియన్ నూతన కమిటీ

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 23 : మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆటో యూనియన్ మండల నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా గట్టు నరసింహ, అధ్యక్షుడిగా కదిరే దశరథ, ప్రధాన కార్యదర్శిగా ఎలగందుల విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా గడ్డం వీరస్వామిగౌడ్, సహాయ కార్యదర్శిగా ఎండీ షానూర్, కోశాధికారిగా మల్లెల నరేశ్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

నేడు భూ భారతిపై అవగాహన

బీబీనగర్, ఏప్రిల్ 23 : భూ భారతి చట్టంపై మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంలో గురువారం అవగాహన కార్యక్రమం చేపట్టనున్నట్టు ఇన్‌చార్జీ తాసీల్దార్ భగత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ అవగాహన సదస్సులో పాల్గొని సమస్యలకు పరిష్కారం పొందాలని సూచించారు.